నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

## అవగాహనతో పనులు చేస్తే మానసిక ఒత్తిడి దూరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 10 : తాము చేసే పనులను ఇష్టం, బాధ్యత, పూర్తి అవగాహనతో చేస్తే మానసిక ఒత్తిడికి లోనుకారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని గురువారం భువనగిరి కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే పనిలో నిబద్ధత కొరవడినా, అధికంగా ఉహించుకొని భయానికి గురైతే మానసిక ఆరోగ్యంతో జీవితంలో చాలా కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. పరిమితులకు లోబడి ఉంటే ఆశలను మానసిక ఒత్తిడి లేకుండా సాధించుకోవచ్చని చెప్పారు.

సమావేశంలో భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీ లత, జిల్లా మానసిక ఆరోగ్య వైద్యాధికారి ప్రీతి స్వరూప్, డిప్యూటీ డీంఎంహెచ్ఓ శిల్పిని, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జైపాల్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ గురుకులం మాకెందుకివ్వరు..?

## యాదాద్రి భువనగిరి జిల్లాకు సర్కారు మొండిచెయ్యి

- మంత్రులు ఉన్న చోటనే కొత్త గురుకులాలు
- సూర్యాపేట జిల్లాకు రెండు, నల్లగొండకు మూడు మంజూరు
- నేడు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శంకుస్థాపన
- ఉమ్మడి నల్లగొండలోని ఏడు నియోజకవర్గాలపై చిన్నచూపు




యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాపై సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నది. జిల్లాల మధ్య వివక్ష చూపిస్తున్నది. ఒక్కో నియోజకవర్గాన్ని ఒక్కో విధంగా చూస్తున్నది. ఇందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల మంజూరే నిదర్శనం. మంత్రులు ఉన్న చోట ఒకలా.. లేని చోట మరోలా కనిపెడుతున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాకు ఇంటిగ్రేటెడ్ గురుకులం ఎందుకు ఇవ్వరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### మంత్రులు ఉన్న జిల్లాలకే..

రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద గురుకులాలను ప్రకటించింది. అయితే మంత్రులు ఉన్న నియోజకవర్గానికి మాత్రమే గురుకులాలను ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు ఒక్కటీ మంజూరు చేయలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రి ఉన్న సూర్యాపేట జిల్లాకు మాత్రం రెండు గురుకులాలు శాంక్షన్ చేశారు. మంత్రి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్ పరిధిలో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇదే జిల్లాకు చెందిన తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో ఏర్పాటు కోసం 24 ఎకరాల స్థలాలను పరిశీలించారు. నల్లగొండకు చెందిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా తన నియోజకవర్గానికి, దేవరకొండ, మునుగోడు నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని మంజూరు చేయించుకున్నారు. నల్లగొండ నియోజకవర్గంలో 20 ఎకరాలను గుర్తించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించారు. కానీ యాదాద్రి భువనగిరికి మాత్రం మొండిచెయ్యి చూపించారు. ఈ జిల్లాను పట్టించుకోకుండా వివక్షను ప్రదర్శిస్తున్నారు.

### మిగతా 7 నియోజకవర్గాలపై చిన్నచూపే..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో తుంగతుర్తి, హుజూర్‌నగర్, నల్లగొండ, మునుగోడు, దేవరకొండ మినహా మిగతా 7 నియోజకవర్గాలపై చిన్నచూపే చూపించారు. అన్ని అసెంబ్లీ పరిధుల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి.

### అందుబాటులోకొస్తే సకల సదుపాయాలు..

ఆయా గురుకులాల నిర్మాణ పనులకు శుక్రవారం ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేయనున్నారు. ఒక్కో గురుకులానికి రూ.200 కోట్ల వరకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు చెందిన నాలుగు పాఠశాలలు ఈ భవనంలో ఉంటాయి. ఆయా పాఠశాలలను సకల సదుపాయాలతో నిర్మించనున్నారు. ప్రాంగణంలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం, గ్రీన్ క్యాంపస్, సోలార్ విండ్ ఎనర్జీ సదుపాయాలు, ల్యాబ్‌లు, కంప్యూటర్ సెంటర్, లైబ్రరీ, ఆడిటోరియం, ఇండోర్ స్పోర్ట్స్, జిమ్, ల్యాండ్ స్కేప్ కోర్టులు తదితర సదుపాయాలు ఉండనున్నాయి. ఒక్కో గురుకులంలో 2,560 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు. 120 మంది టీచర్లు పనిచేయనున్నారు.



### యాదాద్రిపై ఎందుకీ వివక్ష..?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రులు ఉన్న చోటనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు మంజూరు చేశారు. మరి యాదాద్రి భువనగిరి జిల్లా ఏం పాపం చేసింది. సూర్యాపేటకు రెండు ఇచ్చినప్పుడు.. మా జిల్లాకు ఒక్కటైనా ఇవ్వాలి కదా..? గురుకులాలు అందుబాటులోకి వస్తే ఎన్నో సదుపాయాలు కలుగుతాయి. సర్కారు ఫలాలు మా జిల్లా ప్రజలకు ప్రభుత్వం ఇవ్వదల్చుకోలేదా..? దీనిపై ప్రభుత్వం నిర్ణయం సబబుగా లేదు. అన్ని నియోజకవర్గాలకు డిమాండ్ వస్తున్న నేపథ్యంలో అన్నింటికీ ఒకేసారి మంజూరు చేయాలి.

\- జక్కిడి నగేశ్, బీఆర్‌ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి



యాదగిరిగుట్ట ఆలయ తూర్పు మాఢవీధుల్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# పుడమి తల్లికి పూల శోభ

## ఊరూరా సద్దుల బతుకమ్మ సంబురం

### ఆడిపాడిన ఆడబిడ్డలు

### వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు



భువనగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఆలేరు టౌన్ : సాయిగూడెంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరి గుట్ట/భువనగిరి అర్బన్/ఆలేరు టౌన్, అక్టోబర్ 10 : పుడమి తల్లి పూల శోభతో పులకరించింది. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక చోట చేర్చి ఆడిపాడగా పల్లె, పట్నం హరివిల్లులా మారింది. సద్దుల బతుకమ్మ సంబరాలు గురువారం రాత్రి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరిగాయి. మహిళలు, యువతులు పెద్దఎత్తున పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం వాయినాలు ఇచ్చి పుచ్చుకుని 'పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా.. అందరినీ చల్లంగా చూడు.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మ' అంటూ మహిళలు బతుకమ్మకు వీడ్కోలు పలికారు. ఆ తర్వాత బతుకమ్మలను చెరువులు, కుంటలు, కాల్వల్లో నిమజ్జనం చేశారు. పలు చోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిగూడెంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు.



బతుకమ్మలతో భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనిత, కూతురు మన్వితరెడ్డి



చౌటుప్పల్‌లో బతుకమ్మలతో మహిళ



ఆత్మకూర్(ఎం) లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



భువనగిరి పెద్ద చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మహిళ

## ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

చౌటుప్పల్, అక్టోబర్ 11 : ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల గదులను పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన నిర్వహణ తీరును పరిశీలించి, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్, మందుల స్టాక్‌ను కూడా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మందుల కొరత లేకుండా చూడాలని చెప్పారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. 100 పడకల దవాఖాన నిర్మాణపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ రాజగోపాల్, వైద్యులు అలివేలు, దేవేందర్, చిన్నా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ సీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ హనుమంత్ కె.జెండగే



## పండుగకు పల్లె బాట

చౌటుప్పల్, అక్టోబర్ 10 : బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో ఉంటున్న జనం పల్లెబాట పట్టారు. దాంతో విజయవాడ హైవేపై వాహనాల రద్దీ కొనసాగింది. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో గురువారం వాహనాలు బారులుదీరి వెళ్లాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

# ట్రిపుల్ ఆర్ రైతుల ఆశలు ఆవిరి..!

- ఇక భూసేకరణకు అడుగులు ముందుకు
- రెండు, మూడు రోజుల్లో త్రీజీ నోటిఫికేషన్..!
- ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం ఇచ్చేలా కసరత్తు
- పలు దఫాలుగా భూములు పోవడంతో మరో పరిహారం
- అలైన్‌మెంట్ మారుస్తమని నాడు ప్రియాంక గాంధీతో హామీ
- ఎన్నికల్లో గెలిచాక ముఖం చాటేసిన హస్తం పార్టీ
- కాంగ్రెస్ తీరుపై మండిపడుతున్న భూ నిర్వాసిత రైతులు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : ట్రిపుల్ ఆర్ రైతుల ఆశలు ఆవిరయ్యాయి. భువనగిరి మండలంలోని ట్రిపుల్ ఆర్ భూసేకరణపై ఉన్న హైకోర్టు స్టే క్లియర్ అయ్యింది. ఇన్నాళ్లుగా కొనసాగిన స్టేను హైకోర్టు ఎత్తేసింది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. రెండు, మూడు రోజుల్లో త్రీజీ నోటిఫికేషన్ విడుదల కానుంది. రైతులకు పరిహారం పెంచేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు పలు దఫాలుగా భూములు కోల్పోయిన నేపథ్యంలో మరో అదనపు పరిహారం అందించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

ట్రిబుల్ ఆర్ ప్రాజెక్ట్‌గా ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించారు. ఉత్తర భాగంలో జిల్లా మీదుగా 59.33 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించనున్నారు. దీని పరిధిలోకి తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. 24 గ్రామాల మీదుగా రహదారి వేయనున్నారు. రాయగిరి, చౌటుప్పల్ వద్ద ఇంటర్‌ఛేంజ్ జంక్షన్లు నిర్మించనున్నారు. సుమారు 2వేల ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇప్పటికే త్రీడీ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. భువనగిరి మండలం మినహా మిగతా మండలాల్లో అవార్డు తనిఖీ ప్రారంభమైంది. అయితే భువనగిరి మండలంలోని ఏడు గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ రోడ్డు వెళ్తున్నది. భువనగిరి మం డలంలో 491 ఎకరాలు సేకరించనున్నారు.

### హైకోర్టు స్టే ఎత్తివేత..

ట్రిపుల్ ఆర్‌కు రాయగిరి రైతులు భూములు ఇచ్చేందుకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. యాదగిరిగుట్ట విస్తరణ, హైటెన్షన్ వైర్లు, గ్యాస్, జాతీయ రహదారి నిర్మాణం సమయంలో విలువైన భూములను కోల్పోయారు. ఇప్పుడు మళ్లీ ఇక్కడి నుంచి ట్రిబుల్ ఆర్ రోడ్డు వెళ్తుండటంతో ఉన్న అరకొర భూములు కూడా సర్కారు గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ట్రిపుల్ ఆర్ రైతులు మాత్రం కోర్టులో బలంగా కొట్లాడుతున్నారు. తాము ఇప్పటికే మూడు దఫాలుగా వివిధ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయామని, మరోసారి ఇవ్వలేమని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. దీంతో గతంలో హైకోర్టు ట్రిపుల్ ఆర్‌పై స్టే ఇచ్చింది. అయితే సీఎం రేవంత్ రెడ్డి ట్రిపుల్ ఆర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించడంతో జిల్లా ఉన్నతాధికారులతోపాటు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 7వ తేదీన భువనగిరి మండలంలో కొనసాగుతున్న స్టేను ఎత్తివేసింది.




## 'భువనగిరి' మండలంలో హైకోర్టు స్టే ఎత్తివేత

### రెండు, మూడు రోజుల్లో 3జీ నోటిఫికేషన్..

జిల్లా ఉన్నతాధికారులు ట్రిపుల్ ఆర్‌పై పనులు వేగవంతం చేశారు. ఓ వైపు కోర్టు నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు ట్రిపుల్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగేలా అధికారులు కసరత్తు చేశారు. ఇప్పటికే త్రీడీ నోటిఫికేషన్ వచ్చింది. 3జీ నోటిఫికేషన్ కోసం కసరత్తు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో 3జీ నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలిసింది. దీంతోపాటు అదనంగా మరో త్రీడీ నోటిఫిషన్ కూడా రిలీజ్ చేయనున్నారు. 3జీ నోటిఫికేషన్ జారీ చేస్తే రైతులు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడనుంది. ఆ తర్వాతి దశల్లో అవార్డులను పాస్ చేస్తారు. అనంతరం బ్యాంక్ ఖాతాల్లో పరిహారం డబ్బులు జమ చేస్తారు.

### ఎకరాకు 30 లక్షల పరిహారం..!

భూసేకరణలో భాగంగా నిర్వాసితులకు పరిహారం పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం మార్కెట్ విలువ ఎకరాకు రూ. 7లక్షలు పలుకుతున్నది. అధికారులు మాత్రం దీన్ని రూ. 30లక్షలకు పెంచే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మరోవైపు రాయగిరి రైతులకు ఇప్పటికే పలు దఫాలుగా భూములు కోల్పోవడంతో వారికి ప్రత్యేకంగా మరో అదనపు బెనిఫిట్స్ వచ్చేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఒక రైతు ఒకసారి కంటే ఎక్కువగా భూములు కోల్పోతే 2శాతం పరిహారం అదనంగా చెల్లించే వెసులుబాటు ఉందని అధికారులు చెబుతున్నారు.

### కల్లగానే కాంగ్రెస్ హామీ..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు ఇచ్చింది. ఏకంగా ఆ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ భువనగిరి పర్యటనకు వచ్చినప్పుడు స్వయంగా ప్రకటన చేశారు. అంతే కాకుండా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు హామీలు ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా జిల్లాకు తొలిసారి విచ్చేసిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సైతం అలైన్‌మెంట్ మారుస్తామని కలెక్టరేట్‌లో ప్రకటించారు. మరోవైపు దక్షిణ భాగంలో మాత్రం అవసరాలకు అనుగుణంగా అడ్డగోలు మార్పులు చేస్తున్నారు. జిల్లాలోని చౌటుప్పల్ వద్ద జంక్షన్ మార్పు చేశారు. నారాయణపురం మండలంలో అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. కాగా కాంగ్రెస్ పార్టీ నాడు ఓట్ల కోసం తమను నమ్మించి మోసం చేసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ తీరుపై సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తి పోస్తున్నారు. తదుపరి కార్యాచరణకు ప్రణాళికి రూపొందిస్తున్నారు.

## డీఎస్సీ అభ్యర్థులు నేడు రిపోర్టు చేయడానికి ఆఖరు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 10 : హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉద్యోగ నియామక పత్రాలను అందుకున్న డీఎస్సీ అభ్యర్థులు గురువారం సంబంధిత పత్రాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేశారు. రిపోర్టు చేయడానికి శుక్రవారం అవకాశం ఉందని, ప్రత్యేక కౌంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని డీఈఓ సత్యనారాయణ తెలిపారు.

